
చనిపోయిన టైగర్ రొయ్యలు

నెల రోజులుగా టైగర్ రొయ్యల సాగులో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. పలు రకాల వ్యాధుల బారిన రొయ్యపిల్లలు పడుతుండటంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని హేచరీల నుంచి నాసిరకం రొయ్య పిల్లల సరఫరానే దీనికి కారణమంటూ తిరుగుబాటుకు సన్నద్ధమవుతున్నారు. సంబంధిత హేచరీలపై చెన్నైలోని ఎంపెడా (ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ)కు కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నట్లు సమాచారం.

- నాసిరకం రొయ్య పిల్లల సరఫరాతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్న ఆక్వా రైతులు
- సంబంధిత హేచరీలపై తిరుగుబాటుకు సన్నద్ధం



టైగర్ టెర్రర్!

కోట, జూలై 28: సముద్రతీరంలోని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలు ఆక్వాకు ప్రసిద్ధి చెందాయి. గతంలో వేలాది ఎకరాల్లో రొయ్యల సాగు జరిగింది. ఇక్కడికి పాతికేళ్ల క్రితమే టైగర్ రొయ్యను పరిచయమైంది. తర్వాత రైతులందరూ వెనామీ రొయ్య వైపు మొగ్గుచూపి లాభాలు గడిస్తూ వచ్చారు. అనంతరం ఈ సాగు కూడా గిట్టుబాటుకాక పోవడంతో రెండేళ్లుగా మళ్లీ టైగర్ సాగు చేపట్టారు. నెల రోజులుగా టైగర్ రొయ్యల సాగులో నష్టాలు మొదలయ్యాయి. పలు హేచరీల నుంచి సరఫరా అయ్యే టైగర్ రొయ్య పిల్లలు నాసిరకం కారణంగానే వైట్‌స్పాట్ వైరస్ వంటివి సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా తల్లిరొయ్య (బ్రోడర్)నుంచి పిల్లను ఉత్పత్తి చేయకుండా.. పిల్లరొయ్య నుంచే సీడ్ ఉత్పత్తి చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సీడ్‌తో సాగు చేపట్టడంతో రొయ్య పిల్లలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా పెంచాం

టైగర్ రొయ్యలలో వస్తున్న వ్యాధులపై పరిశీలన ప్రారంభించాం. రొయ్యపిల్లలు నాసిరకమా లేదా వాతావరణంలో వచ్చిన మార్పా? పరిశీలిస్తున్నాం. కొన్ని రొయ్యపిల్లలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపే ప్రయత్నంలో ఉన్నాం. ఆరోపణలు వస్తున్న హేచరీలపై నిఘా పెంచాం.

- నాగరాజు, మత్స్యశాఖ డీఎఫ్‌వో

జరగాల్సింది ఇలా..

అమెరికా, తైవాన్ నుంచి తల్లి (బ్రోడర్) రొయ్యలను అనుమతి కలిగిన హేచరీలు దిగుమతి చేసుకుంటాయి. ఆయా హేచరీలలో ఈ తల్లిరొయ్య నుంచి పలు పద్ధతుల్లో పిల్ల రొయ్యలను ఉత్పత్తి చేస్తారు. ఆ తర్వాత వీటిని రైతులకు విక్రయిస్తుంటారు.

ఏం జరుగుతోందంటే..

కొన్ని హేచరీలు అమెరికా వంటి దేశాల నుంచి తల్లిరొయ్యకు బదులు పిల్ల రొయ్యను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇవి సరైన పరిపక్వత రాకుండానే వాటినుంచి పిల్ల రొయ్యలను తయారుచేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. ఇటువంటి పిల్ల రొయ్యతో సాగు చేసిన ఎనిమిది రోజుల్లోపే అవి ఆక్సిజన్ పీల్చకుండా ఎదుగుదల లేకుండా చనిపోతున్నాయి. దీని వల్ల లక్షల రూపాయలను రైతులు నష్టపోతున్నారు. మరికొన్ని హేచరీల్లో అయితే మనదేశంలో ఉత్పత్తి అయిన తల్లి రొయ్యల నుంచి సరైన పద్ధతులు పాటించకుండా పిల్ల రొయ్యలను తయారు చేస్తుండటంతో అవి కూడా చనిపోతున్నాయి.

గంధమనేనికి కన్నీటి వీడ్కోలు

- టీడీపీ నేతల నివాళులు
- ఫోన్‌లో కుటుంబీకులకు సీఎం పరామర్శ

నింద్ర, జూలై 28: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్రప్రసాద్‌కు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారం ఆయన రమేష్ చంద్ర ప్రసాద్ కుమారుడు రాజేష్‌తో ఫోనులో మాట్లాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రమేష్ చంద్ర భౌతిక కాయానికి పలమనేరు, చంద్రగిరి, పూతలపట్టు, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తినాని, మురళీమోహన్, భానుప్రకాష్, ఆదిమూలం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనుభవం కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. తమ రాజకీయ ఎదుగుదలలో ఆయన పాత్ర ఉందని గుర్తుచేసుకున్నారు. గ్రామస్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకులందరితో మంచి సంబంధాలున్న నాయకుడని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, కందేరి జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మోహన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర నాయకులు పోతుగుంట విజయబాబు, ఆర్సీ మునికృష్ణ, నాగేంద్ర నాయుడు, శ్రీధర్‌బాబు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్‌తోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది తరలివచ్చారు.


చంద్రబాబుతో ఫోనులో మాట్లాడుతున్న రాజేష్


రమేష్‌చంద్ర ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ తదితరులు


నివాళులర్పిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద

గంటపాటు ఉద్రిక్తత


41ఏ నోటీసు చూపుతున్న మోహిత్‌రెడ్డి

- తిరుపతికి ఉదయం 6.50 గంటలకు మోహిత్‌రెడ్డి తరలింపు
- పోలీసుల ప్రశ్నలకు సహకరించని వైనం!
- 41ఏ నోటీసు ఇచ్చి.. 8.05గంటలకు షరతులతో విడుదల


ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28: ఎస్వీయూ పోలీసు స్టేషను వద్ద ఆదివారం ఉదయం గంటా 15 నిమిషాలపాటు ఉద్రిక్తత నెలకొంది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని తీసుకొచ్చిన సందర్భంగా అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే.. నాటి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జూలై 14న జరిగిన హత్యాయత్నం కేసులో వైసీపీ అభ్యర్థి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి నిందితుడు. తండ్రి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సోదరుడు హర్షిత్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి దుబాయ్ వెళ్లడానికి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో వేచి ఉన్న మోహిత్‌ను అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో 10 వాహనాలు.. 70 మంది పోలీసు భద్రత నడుమ చెవిరెడ్డి, ఆయన ఇద్దరి కుమారులను ఉదయం 6.50 గంటలకు తిరుపతిలోని ఎస్వీయూ పోలీసు స్టేషనుకు తీసుకొచ్చారు. మోహిత్‌రెడ్డి ఒక్కరినే స్టేషనులోకి తీసుకెళ్లారు.ఈ ఘటనతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. విచారణలో భాగంగా పోలీసులు మోహిత్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ, విచారణలో ఆయన ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసలు తప్పు చేయకుంటే దుబాయ్‌కి ఎందుకు తప్పించుకుని వెళుతున్నారని.. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని అడిగినట్లు సమాచారం. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాట వేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం 41ఏ నోటీసులిచ్చారు. ఎప్పుడు విచారణకు పిలిచినా రావాలని, స్థానికంగా అందుబాటులో ఉండాలని షరతులు విధించారు. అయితే మోహిత్‌రెడ్డి మాత్రం 'అరెస్టు చేయండి.. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచండి' అంటూ కొంతసేపు మొరాయించి కూర్చొన్నట్లు తెలిసింది. తద్వారా సానుభూతి పొందే ప్రయత్నం చేశారన్న వ్యాఖ్యలు వినిపించాయి. పోలీసులు మాత్రం 41ఏ నోటీసు ఇచ్చి 8.05 గంటలకు ఆయన్ను బయటకు పంపారు. కాగా, ఉదయం ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద సివిల్, రిజర్వు, ఎస్టీఎఫ్ పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల వాహనాల రాకపోకలను నియంత్రించారు. ఎస్వీయూ స్టేషన్ చుట్టూ ఎవరినీ అనుమతించలేదు. పద్మావతి అతిథి గృహం సిబ్బందినీ లోపలకు పంపలేదు.

బెడిసికొట్టిన 'వ్యూహం'!

పోలీసు చర్యలతో సానుభూతి పొందాలన్న వైసీపీ వ్యూహం బెడిసి కొట్టిందా? ఈ ప్రశ్నకు రాజకీయవర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. మోహిత్‌రెడ్డి అరెస్టయితే చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టేందుకు శ్రేణులను సిద్ధం చేసుకున్నారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకునేలా చర్యలు చేపట్టారు. కానీ, పోలీసు అధికారులు ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకూ విచారణకు అందుబాటులో ఉండాలంటూ 41ఏ నోటీసు ఇచ్చి పంపేశారు. దీంతో ఏం చేయాలో తోచక వైసీపీ వర్గాలు గందరగోళంలో పడ్డాయి. నియోజకవర్గవ్యాప్తంగా కూడా ఉద్రిక్తతలకు అవకాశం లేకుండా పోయింది.

చెవిరెడ్డి నిరసన



ఎస్వీయూ వర్సిటీ వద్ద ఫుట్‌పాత్‌పై అనుచరులతో కలిసి చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిరసన చేపట్టారు. ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేని మోహిత్‌ని రెండు నెలల తర్వాత ఏ37గా చేర్చి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ప్రజా పోరాటాలు ఎలా ఉంటాయో ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు రుచి చూపిస్తామని హెచ్చరించారు. తీవ్రవాది, ఆర్థిక ఉగ్రవాదికి ఇచ్చినట్లు లుక్‌అవుట్ నోటీసు జారీ చేసి ఇప్పుడు 41ఏ నోటీసుతో వదలి పెట్టడం ఈ ప్రభుత్వ దుర్మార్గపుతనానికి నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వానికి, పోలీసులకు దమ్ముంటే ఆధారాలతో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలని డిమాండు చేశారు. చంద్రగిరి మండలం కూచువారిపల్లెలో తమ రెండు కార్లు, సర్పంచి ఇల్లు దహనం, తమ శ్రేణులపై దాడి చేసిన కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నాని కారుపై దాడి జరిగిన మాట వాస్తవమన్నారు. నానిపై 37 మంది దాడి చేసుంటే ఆయనకు ఎందుకు చిన్నగాయం కూడా తగల్లేదన్నారు. స్విమ్స్ నివేదికలే దీనికి సాక్ష్యమన్నారు. నానీపై తాను దాడి చేయలేదని కాణిపాకం లేదా ఏ దేవుడి వద్దనైనా ప్రమాణం చేయడానికి సిద్ధమని మోహిత్‌రెడ్డి తెలిపారు. నానీ అవినీతి, భూదందాలు, గ్రానైట్ అక్రమాలు, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటాలు చేస్తామన్నారు. భయపెట్టి పాలన చేయాలంటే ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు.

తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదు: నాని

తిరుచానూరు: తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన దాడుల విషయం ప్రతిది మీడియాకు తెలుసన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చెవిరెడ్డికి భంగపాటు తప్పదన్నారు. 'చట్టాన్ని నా చేతిలోకి తీసుకుని శిక్షించడానికి, తప్పుడు కేసులు పెట్టడానికి రెండు నెలలు ఎదురు చూడాల్సిన పనిలేదు. ఎన్నికలకు ముందు ప్రధాన నిందితుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేరు చెప్పాను. విచారణలో నిందితులు మీ పేరు ఎందుకు చెప్పారో తెలుసుకోండి. పోలీసుల విచారణలో భాగంగా మోహిత్‌రెడ్డిని 37వ నిందితుడిగా చేర్చారు. ప్రజలకు తప్పుడు సమాచారం... తప్పుడు సంకేతం ఇవ్వడం మానుకోవాలి. విదేశాల్లో చదివినా హత్యాయత్నం చేసిన వారికి శిక్ష తప్పదు' అని పులివర్తి నాని వ్యాఖ్యానించారు. చంద్రగిరి అభివృద్ధికే సమయం చాలని తాను.. చెవిరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు సమయం ఎక్కడుందన్నారు.


ఆర్సీపురం మండలంలోని భూమి

భూమి ఉండేది రామచంద్రాపురం మండలం పరిధిలో అయితే తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైంది. వాటికి రూరల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు. ఫలితంగా రూ.కోటి విలువైన భూమి ఓ వైసీపీ నేత ఖాతాలోకి చేరిపోయింది. ఆలస్యంగా ఈ విషయం భూ యజమానికి తెలిసి కుయ్యోమొర్రోమంటూ రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని వేచిచూశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కుమ్మక్కై వైసీపీ నేతకు తన భూమిని ఎలా కట్టబెట్టారో ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ నేత లీలలు?

ఆర్సీపురం మండలంలోని స్థలానికి తిరుపతి రూరల్‌లో ఫేక్ రికార్డులు

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో రూ.కోటి స్థలం స్వాహా

న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితుడు

తిరుపతిలో నివసించే కె.పురుషోత్తమ రెడ్డికి రామచంద్రాపురం మండలం సి.రామాపురం గ్రామంలో సర్వే నెంబరు 73/3లో 2.32 ఎకరాల పూర్తి విస్తీర్ణ భూమికి 1959 నుంచి రికార్డు ఉంది. 2022 ఏప్రిల్‌లో అనుమానం వచ్చి కొత్త అడంగల్ పరిశీలించగా 10 సెంట్ల భూమి తగ్గి 2.22 ఎకరాలని చూపించింది. ఖంగుతిన్న బాధితుడు రికార్డులను పరిశీలించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఆర్సీపురం, తిరుపతి రూరల్ మండల ఉద్యోగులు కుమ్మక్కై తన భూమిలోని 10 సెంట్లను వేరే వ్యక్తికి ఇచ్చినట్లు తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ద్వారా జారీ అయినట్లు నకిలీ 1-బీ, అడంగల్ ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించినట్టు గుర్తించారు. ఆ తర్వాత ఈ భూమిని స్థానిక జడ్పీటీసీ డిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేసేశారు. ఆర్సీపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఆర్ఐగా పనిచేసిన జీవన్‌రెడ్డి ప్రధాన సహకారంతో వైసీపీ నేత వి.భానుకుమార్ రెడ్డి ఆ భూమిని తన భార్య డిల్లీరాణి పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఈ లావాదేవీల్లో వీఆర్వో ప్రసాద్, డీటీ మునిశైలజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాషా, సి.రామాపురం విలేజ్ సర్వేయర్ హర్షవర్ధన్‌లకు ప్యాకేజీ మొత్తం ఆర్ఐ జీవన్ ద్వారా పంచి.. భూమిని కొల్లగొట్టాడని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. దీనిపై రెండేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా వారు విచారణ జరపడం లేదని వాపోయారు. ఆర్డీవో కార్యాలయంలో విచారణ జరపకుండా కొందరు సిబ్బంది అడ్డుపడుతున్నారని, భూ కుంభకోణానికి బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకుని, 10 సెంట్ల భూమిని తిరిగి తన ఖాతాలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని బాధితుడు కోరుతున్నారు.


క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేంద్ర

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నేతల దాడి

శ్రీకాళహస్తి, జూలై 28: టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నేతలు దాడి చేసి గాయపరిచిన ఘటన తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రాజేంద్ర తెలిపిన వివరాల మేరకు.. కొత్తకండ్రిగ గ్రామంలో టీడీపీకి చెందిన సురేష్, వైసీపీకి చెందిన విజయకుమార్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల సమయంలో ఇరువురి మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయి. ఆదివారం సురేష్, విజయకుమార్ మధ్య మాటా మాట పెరిగి వివాదానికి దారి తీసింది. ఆగ్రహించిన విజయకుమార్ తన బాబాయి బాబు, తమ్ముడు గురునాథంతో కలిసి కర్రలతో టీడీపీ సానుభూతిపరుడైన సురేష్ ఇంటిపై దాడి చేశారు.ఈ ఘటనలో సురేష్‌తోపాటు అతని భార్య షర్మిల, బావ రాజా, మామ వెంకటయ్య గాయపడ్డారు.క్షతగాత్రులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాఆస్పత్రిలో చేరారు. ఎస్ఐ రాజేంద్ర ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


షార్‌కు వాహనంలో వెళ్తున్న రాకెట్ పరికరాలు

షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు

సూళ్లూరుపేట, జూలై 28: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)కు రాకెట్ ప్రయోగ పరీక్షలకు ఉపయోగించే వివిధ రకాల పరికరాలు ఆదివారం ప్రత్యేక వాహనంలో చేరాయి. షార్ నుంచి ఆగస్టు మొదటి వారంలో పీఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్ ప్రాజెక్టు పరీక్షలకు సంబంధించిన రాకెట్‌కు వినియోగించే విడి పరికరాలు కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి వాహనంలో తీసుకొచ్చారు. ఈ పరికరాలను రాకెట్ అనుసంధానానికి వివిధ దశల్లో అవసరాన్ని బట్టి వినియోగించనున్నారు.

పాలిటెక్నిక్‌లలో 31న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విద్య), జూలై 28: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో మిగిలిన డిప్లొమా సీట్ల భర్తీకి ఈనెల 31వ తేదీన ఉదయం 10గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు, ప్రవేశపరీక్ష రాయనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తర్వాత ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, కౌన్సెలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు ఈ అడ్మిషన్లకి అనర్హులని పేర్కొన్నారు.

ఉత్కంఠభరితంగా దుర్యోధన వధ



రామచంద్రాపురం, జూలై 28: పరమాల, బుట్టిరెడ్డికండ్రిగ, మోటావారికండ్రిగ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం ఉత్కంఠ భరితంగా సాగింది. ఆలయం ముందు దుర్యోధనుడి భారీ మట్టిప్రతిమను తయారు చేశారు. అక్కడ దుర్యోధన వేషధారి కిరణ్, భీమ వేషధారి అశోక్ మధ్య సంభాషణలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి జ్యోతి, సురేంద్ర నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో వేకువజామున మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం భాగవతారిణి సుమతి మహాభారత యుద్ధసంగ్రామం, పాండవ మహాప్రస్థానం ఘట్టాలను రమ్యంగా వినిపించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్ద వేంచేపు చేశారు. ఆలయ పూజారి నిప్పు కణికలను అమ్మవారి ఒడిలో కట్టారు. అనంతరం పూలమాలలు అగ్నిగుండంలో వేసి గోవిందనామ స్మరణల మధ్య ఆయనతో పాటు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

శాకాంబరిగా మరకత శక్తి కాళి దర్శనం



రామచంద్రాపురం, జూలై 28: ఆషాడ మాసం సందర్భంగా రాయలచెరువు కట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన మరకత శక్తి అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో విశేష పూజల అనంతరం శ్వేత వారాహిదేవి, ప్రత్యంగిరా దేవి, మరకత శక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి, పలురకాల కూరగాయలతో అలంకరణ చేశారు. ఉదయం శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించి, పూర్ణాహుతితో ముగించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరునాళ్ల



రామచంద్రాపురం, జూలై 28: మండలంలోని చల్లావారిపల్లె గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాల నడుమ వైభంగా ఊరేగించారు. పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పేదలకు అన్నదానం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 28: టీడీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి డాలర్ దివాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం రామాపురం నాలుగురోడ్ల కూడలి వద్ద టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరసింహారెడ్డి, రామిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, రవి, అమర్‌నాథ్‌రెడ్డి, రాజారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డి, మధు, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చంద్రగిరి, జూలై 28: చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1975-76వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం చంద్రగిరిలో నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు సూర్యకుమారి, వెంకటరెడ్డి, రెడప్పరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, చేగు గోవర్ధన్‌గుప్తా, కల్లూరి హరినాథ్‌రెడ్డి, బాదూరు ఎల్లయ్య, నజీర్, త్యాగరాజులు, సంగారెడ్డి, గుణశేఖర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం అదరహో..!



తిరుచానూరు, జూలై 28: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అదరహో అనేలా సాగింది. తిరుపతి నగరంలోని పుష్ప నృత్యాలయానికి చెందిన కళాకారులు మిషిత, భవిష్య, గిష్టసాయి, జెసిక, హిమశ్రీ, షన్వి, యషిక, కీర్తిక, నితిక, సాయి సుప్రజ, హైమ వర్షిణి తదితరులు శ్రీవిష్ణు రాజం భజే, షణ్ముక కౌత్వం, మలారి, వచ్చెను అలిమేలు మంగ, రామచంద్రుడు, శివోహం, జగదానంద, జగడపు, భో శంభో, జయలక్ష్మి వరలక్ష్మి వంటి కీర్తనలకు నృత్యం చేశారు. రెడ్డప్ప బృందం ప్రదర్శించిన జానపద నృత్యాలాపన సభికులను ఆకట్టుకుంది. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఇద్దరు విద్యుత్ ఏఈలపై వేటు

చిత్తూరు రూరల్, జూలై 28: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ శాఖలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఏఈలపై ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్ర నాయుడు వేటు వేశారు. ఇందులో పెనుమూరు ఏఈ నీరజ, తిరుపతి జిల్లా అవిలాల ఏఈ నాగరాజు ఉన్నారు. వీరిద్దరు 2019-20 సంవత్సరానికి చెందిన వర్క్‌ఆర్డర్లను ఇప్పటికీ క్లోజ్ చేయలేదు. దీనిపై పలుమార్లు హెచ్చరించినా పనులు పూర్తి చేయలేదు. దీంతో క్రమశిక్షణా చర్యల కింద వారిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించినట్లు ఆయన తెలిపారు. పెనుమూరు ఏఈ స్థానంలో అదే సెక్షన్‌లోని సబ్ ఇంజనీరు తులసికి, అవిలాల ఏఈ స్థానంలో తిరుపతి ఆపరేషన్ సెక్షన్ ఏఈ శ్రీనివాసులు నాయుడుకు బాధ్యతలు అప్పగించారు.



గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న జనసేన నేత ఎన్‌వీ ప్రసాద్, తిరుపతి నగర పాలక సంస్థ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత మస్తాన్ నాయుడు

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం పూజలు చేస్తున్న ఉభయదారులు

● నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు

పాకాల, జూలై 28: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం, యాగపూజ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు ఏటుకూరి సుబ్బరామా నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉభయదారులు అత్తులూరి ఆనంద నాయుడు, రజనిల ఆధ్వర్యంలో నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులను ఊరేగించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక పూజలు నిర్వహించి, వాహన సేవలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేసి ప్రత్యేక విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్ చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడికృత్తికకు ఘనంగా ఏర్పాట్లు : మంగళవారం ఆడికృత్తికను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి విశేష సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేశారు. నిరంతం అన్నప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.





నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు, పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని, ఉభయదారులు

నేడు కాణిపాకం ఆలయం నుంచి పట్టువస్త్రాల సమర్పణ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ తీసుకొస్తారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా సుబ్రమణ్య స్వామికి సమర్పించనున్నారు. సోమవారం ఉదయం యాగపూజ, భరణి అభిషేకం, షణ్ముఖ సహస్ర నామార్చన, మహా మంగళ హారతి, సాయంత్రం భరణి దీపోత్సవం, రాత్రి నెమలి వాహనంపై సుబ్రమణ్యస్వామి ఊరేగింపు సేవ నిర్వహించనున్నారు.

ముందు వెళుతున్న లారీని ఢీకొని టెంపో ట్రావెలర్ బోల్తా

ఇద్దరికి తీవ్రగాయాలు, 11 మందికి స్వల్ప గాయాలు



గడ్డక్రిందపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడిన టెంపో ట్రావెలర్

చంద్రగిరి, జూలై 28: చంద్రగిరి మండలం, గడ్డక్రిందపల్లి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ముందు వెళుతున్న లారీని ఢీకొని, అదుపు తప్పి టెంపో ట్రావెలర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన రాధాకృష్ణ కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనార్థం శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి దర్శనం టోకెన్లు దొరక్కపోవడంతో ఆదివారం ఉదయం కాణిపాకం వినాయకస్వామి దర్శనార్థం టెంపో ట్రావెలర్‌లో మొత్తం 12 మంది వెళుతుండగా, మార్గమధ్యంలో గడ్డక్రిందపల్లి సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీ కొని, టెంపో ట్రావెలర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ అనిల్, పద్మావతిలకు తీవ్ర గాయాలు కాగా, రాధాకృష్ణ, శ్రీభరణి, మోహన్, హర్షిణిరెడ్డి, శశికుమార్, సరిత, సాయిదక్ష, సాయిరాఘవ్, సాయిదత్, సంధ్య, హైమావతిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108, హైవే అంబులెన్స్ వాహనాల్లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం







సీఆర్వో వద్ద ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న వృక్షం - ఎంబీసీ వద్ద ఒరిగిన వృక్షం - పీఏసీ4 వద్ద ప్రమాదకరంగా ఉన్న వృక్షం

తిరుమలలో ప్రమాదకరంగా భారీ వృక్షాలు

ఈదురుగాలులతో భయాందోళన చెందుతున్న భక్తులు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొన్ని ప్రదేశాల్లో భారీ వృక్షాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఈదురుగాలులతో అటు ఇటు ఊగుతూ భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల జపాలి క్షేత్రంలో ఓ చెట్టు కొమ్మ విరిగిపడి బెంగళూరుకు చెందిన మహిళ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అలాగే బాటగంగమ్మ ఆలయానికి సమీపంలో ఉన్న కారు పార్కింగ్‌లోనూ ఓ భారీ వృక్షం కూలి మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో భక్తులెవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇలా గత మూడు వారాలుగా వాతావరణంలో మార్పులతో ఈదురుగాలులు వీస్తున్న క్రమంలో తిరుమలలోని భారీవృక్షాలు ఊగిపోతూ భయానకంగా దర్శనమిస్తున్నాయి. దీంతో భక్తులు భయంతో వణికిపోతున్నారు. ఈక్రమంలో ఫారెస్ట్ అధికారులు ఇప్పటికైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రమాదకరమైన చెట్లను గుర్తించి తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కేసుపై వివిధ కోణాల్లో దర్యాప్తు



తుకారాంలో ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలక రికార్డులు తగులబెట్టిన కేసుపై పోలీసులు దర్యాప్తు వివిధ కోణాల్లో చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి తుకారాం కాపురముంటున్న తిరుపతి నగరం మంగళం రోడ్డులోని ఇంట్లో ఆదివారం మదనపల్లె పోలీసులు, సీఐడీ అధికారులు మూడు గంటల పాటు తనిఖీలు చేసి, కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిరుపతిలో ఉన్న మాజీ మంత్రి బినామీలను కూడా విచారించనున్నట్లు సమాచారం.

సీఎం కుటుంబంపై అసభ్య పోస్టులు

● వైసీపీ కార్యకర్తపై పోలీసులకు ఫిర్యాదు


కుప్పం, జూలై 28: సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఆయన కోడలు బ్రాహ్మణిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌పైనా పోస్టింగులు పెట్టారు. కుప్పం మండలం నూలుకుంటకు చెందిన తిరుఅమ్ము పేరిట సోషల్ మీడియాలో ఈ పోస్టులు పెట్టారు. వాటిని గమనించిన టీడీపీ సోషల్ మీడియా వింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శ్రీవారి ఆలయంలో 15నుంచి పవిత్రోత్సవాలు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. 14వ తేదీ అంకురార్పణలో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16వ శతబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. ఆ తర్వాత 1962 నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. ఉత్సవాల్లో భాగంగా మూడ్రోజులపాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 15న పవిత్రాల ప్రతిష్ఠ, 16న పవిత్ర సమర్పణ, 17న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే ఆగస్టు నెలలో 4న చక్రత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం, ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య వర్ష తిరునక్షత్రం, 7న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, పురిశైవారి తోటకు శ్రీవారి వేంచేపు, 9న గరుడపంచమి, గరుడసేవ, 13న తరిగొండ వెంగమాంబ జయంతి, 16న వరలక్ష్మీ వ్రతం, నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం, 19 పౌర్ణమిగరుడసేవ, హయగ్రీవ జయంతి, 20న విఖనసాచార్య స్వామి సన్నిధికి శ్రీవారి వేంచేపు కార్యక్రమాలు 27న శ్రీకృష్ణాష్టమి కార్యక్రమాలు జరగనున్నాయి.

ఐటీపై టీటీడీ ప్రత్యేక దృష్టి

అక్రమార్కులకు చెక్‌పెట్టేందుకు చర్యలు
రాండమ్ బుకింగ్స్ అడ్డుకునేందుకు ప్రణాళిక
ఫేక్ ఆధార్‌పై కసరత్తు



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) విభాగ అభివృద్ధిపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ సేవలను మరింత అభివృద్ధిపరిచి అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు టీటీడీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సేవలను సామాన్య భక్తులే పొందేలా చర్యలు తీసుకుంటోంది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రతి నెలా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జితసేవలు, గదుల కోటాను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతమున్న ఐటీ వ్యవస్థలోని లోపాలను అవకాశంగా తీసుకున్న కొంతమంది ఆ సేవలేవీ సామాన్యులకు అందకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు వివిధ విభాగాలతో పాటు ఐటీ విభాగంపై కూడా దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఐటీ విభాగంలో అనేక లోపాలు ఉన్నట్టు గుర్తించారు.

ఒకే నంబరు, మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు

సామాన్య భక్తులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో టీటీడీ కొన్ని ఆర్జితసేవలను రెండుగా విభజించింది. అందులో ఒకటి మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన కొన్ని సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నారు. మరికొన్ని ఆర్జిత సేవలను ఆన్‌లైన్ లక్కీడిప్ ద్వారా కేటాయిస్తున్నారు. లక్కీడిప్ రిజిస్ట్రేషన్‌కు రెండురోజుల వ్యవధి ఇస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాలో కొన్నింటిని రాండమ్‌గా ఎంపిక చేసి భక్తులకు సమాచారాన్ని అందజేసి నగదు చెల్లింపునకు మరో రెండురోజుల సమయం ఇస్తారు. అయితే కొంతమంది దళారీలు, టెక్నాలజీపై కాస్త పట్టు ఉన్న వ్యక్తులు ఐటీలోని లోపాలు గమనించి ప్రతి నెలా కొన్ని ఆర్జితసేవా టికెట్లను పొందుతున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా తమకు ఆర్జితసేవలు అందడం లేదని తరచూ పలు ప్రాంతాల నుంచి భక్తులు టీటీడీకి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈనేపథ్యంలో టీటీడీ ఉన్నతాధికారుల పరిశీలనలో నివ్వెరపోయే విషయాలు వెలుగుచూశాయి. ఇందులో ప్రధానంగా ఒకే సెల్ నెంబరు, ఒకే మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గుర్తించారు. ఒకే వ్యక్తి 1,800 సార్లు రిజిస్ట్రేషన్ చేసి 60 సార్లు డిప్ ద్వారా సేవా టికెట్లు పొందడం ఐటీ విభాగ వైఫల్యమేనని అధికారులు గుర్తించారు. అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటే ఏదో ఒక ఆర్జితసేవ డిప్ ద్వారా రావడం ఖాయమని భావించిన కొందరు వ్యక్తులు ఇతరులెవరికీ సేవలందకుండా చేస్తున్న క్రమంలో టీటీడీ ఒకే నెంబరు, మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న జాబితాను ఇటీవల తయారు చేసింది. ఈ తరహాలో పొందిన బుకింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు ఆయా నెంబర్లు, మెయిల్స్ బ్లాక్ చేశారు. ఇదే తరహాలో గదులు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు పొందిన వారి బుకింగ్స్‌ను కూడా రద్దు చేశారు. ఇకపై తరచూ వచ్చే నెంబర్లు, మెయిల్స్‌పై దృష్టి పెట్టాలని విజిలెన్స్ అధికారులు సూచించడంతో పాటు ఒకసారి బుకింగ్‌కు వినియోగించిన నెంబరు, మెయిల్ మళ్లీ 90 రోజుల పాటు బుకింగ్‌కు ప్రవేశం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు.

ఇకపై ఫేక్ ఆధార్లకు నో ఎంట్రీ

భక్తులు ఇస్తున్న ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థ టీటీడీలో లేకపోవడం దళారీల పాలిట వరంలా మారింది. దీంతో ఫేక్ ఆధార్ కార్డులతో చాలా మంది ఇష్టానుసారం దర్శనం, ఆర్జితసేవలు, గదులు పొందుతున్నారు. ఇటీవల అనంతపురానికి చెందిన వ్యక్తి ఇతర భక్తుల ఆధార్‌లో ఫొటోను, నెంబర్లను మార్చి ఒకే నెలలో 28 గదులు పొందాడు. ఇలా దాదాపు 25 మంది దళారీలు ఫేక్ ఆధార్లతో గదులు పొంది భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు 26 రోజుల క్రితం వెలుగు చూసింది. ఈ క్రమంలో ఫేక్ ఆధార్లను అరికట్టేందుకు టీటీడీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులోభాగంగా గతనెల 29వ తేదీన టీటీడీ ఈవో యూఐడీఏఐ(ఆధార్ సంస్థ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీలను అరికట్టవచ్చని అభిప్రాయంతో యూఐడీఏఐ అధికారుల సహకారం కోరారు. దీనికోసం ప్రత్యేకంగా ఓ అప్లికేషన్‌ను రూపొందించి ఆధార్ సంస్థ సర్వీసును పొందాలని భావిస్తున్నారు. దీనికి ఆధార్ సంస్థ కూడా సానుకూలంగా స్పందించింది. తద్వారా భక్తులు అందజేసే ఆధార్ నిజమైనదా కాదా అనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. గతంలో ఐటీ విభాగంలో సూపరింటెండెంట్ ర్యాంక్‌లో జీఎం పోస్టును క్రియేట్ చేసి ఓ వ్యక్తిని నియమించినప్పటికీ ఆయనకు ఉండాల్సిన అర్హతలు లేవని ఈవో అభిప్రాయపడ్డారు. ఆ పోస్టులో అనుభవం ఉన్న వ్యక్తిని నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు సర్వీసు ఇస్తున్న జియో, టీసీఎస్ సంస్థలకు నూతన టార్గెట్లు ఇచ్చే దిశగా కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండులో అధ్వానంగా టాయిలెట్లు

● ప్రయాణికుల అసంతృప్తి ● స్వల్ప మరమ్మతులూ చేయని వైనం



బస్టాండులోని కాణిపాకం పాయింట్ వద్ద అధ్వానంగా ఉన్న టాయిలెట్లు



తిరుపతి(ఆర్టీసీ), జూలై 28: 'టాయిలెట్ల నిర్వహణ బాగాలేదు.. అధిక రుసుం వసూళ్లతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు.. పర్యవేక్షణ ఉండదా' అంటూ ఇటీవల ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆర్టీసీ అధికారుల ముందు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయినా వారిలో ఎలాంటి మార్పు కానరావటం లేదు. సెంట్రల్ బస్సు స్టేషన్‌లోని టాయిలెట్లు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టాయిలెట్ల గడపలు ధ్వంసమై ఉన్నాయి. దీంతో టైల్స్ మీద కాలుమోపగానే ప్రయాణీకుల పాదాలకు రక్తగాయాలవుతున్నాయి. డోర్లు విరిగిపోవడంతో అసౌకర్యం, అడుగు భాగం పాచిపట్టి ఉండటంతో అదుపుతప్పి పడిపోవడం, కొళాయిల లీక్‌తో నీరు వృధా, వాష్‌బేసిన్ వద్ద అపరిశుభ్రత, మురుగు నీరు వెళ్లే రంధ్రాలు తెరిచి ఉండటంతో బొద్దింకలు, ఎలుకలు వెలుపలకు రావడం, వ్యర్థాలు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. తరచూ పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు అటువైపు కూడా వెళ్లకపోవడంతోనే పరిస్థితి ఇలా ఉంటుందనే విమర్శలు ఉన్నాయి. మరుగుదొడ్ల వద్ద రూ.2, 3కు బదులుగా రూ.10, 20 చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బోర్డుపై ధరను చూసి ప్రశ్నిస్తే, దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు. రాత్రివేళల్లో ఆ పరిమితి కూడా దాటుతుందని చెబుతున్నారు. అయితే అద్దె అధికంగా ఉండటం, టెండరు దక్కించుకున్న వ్యక్తి కాకుండా మూడో వ్యక్తి నిర్వహణ చూస్తుండటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రయాణికుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హెపటైటిస్‌పై అవగాహన తప్పనిసరి



హెపటైటిస్ గురించి ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అపర్ణ

తిరుపతి(వైద్యం), జూలై 28: వైరస్ వలన సంక్రమించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో హెపటైటిస్ (వైరస్ సంబంధిత కాలేయ) వ్యాధి ఒకటని, దీనిపై ప్రతీ ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ అపర్ణ అన్నారు. ప్రపంచ హెపటైటిస్-బి దినోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని ప్రత్యేక జైల్లో ఖైదీలకు హెపటైటిస్, దాని నివారణ మార్గాలపై ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ అనే వ్యాధి శుభ్రత లేని సిరంజులు, నీడిల్స్, బ్లేడ్లు, రక్తం ఎక్కించడం, అక్రమ శారీరక సంబంధాల వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ముందుగానే హెపటైటిస్-బి వ్యాక్సిన్ ప్రతీ ఒక్కరూ వేసుకోవాలన్నారు. ఈ వ్యాధి బారిన పడిన బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఏడాదికి ఒకసారి హెపటైటిస్ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జైలర్ గుణశేఖర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్, ఎల్‌టీ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే ఆరణికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 28: జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఆదివారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. గత ఐదేళ్లుగా పనులు లేక కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గతప్రభుత్వం కార్మికులను ఆదుకోలేదని చెప్పారు. అర్హులైన కార్మికుల క్లైమ్‌లు రిజిస్టర్ చేయాలని కోరారు.

పళనివేల్‌కు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదు



తిరుపతి (కల్చరల్), జూలై 28: ప్రముఖ సంగీత కళాకారుడు హరిద్వార మంగళం ఎ.కె.పళనివేల్‌కు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం జరిగింది. తిరుపతిలోని త్యాగరాజ స్వామి ట్రస్టు 80వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక త్యాగరాజ మండపంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీఎస్‌ఆర్. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వాహకులు బిరుదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి త్యాగరాజ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కె.వి.మోహనసుందరం, కంచి రఘురాం తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు జలతరంగ కళాప్రవీణ ఎస్.సోమయాజులు కచేరి జరిగింది. చివరగా రాత్రి 8 గంటలకు ప్రముఖ వయోలిన్ కళాకారిణి కన్యాకుమారి కచేరి ఆహుతులను అలరించింది.

ప్లాస్టిక్ రహిత వర్సిటీగా మారుస్తాం

ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు



పాల్గొన్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28: ఎస్వీయూను ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి ప్రయత్నిస్తామని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆదివారం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వీరిని ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అభినందించారు. అనంతరం భూపతి నాయుడు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు జీవుల మనుగడకు అవరోధమన్నారు. పర్యావరణానికి కూడా ఎక్కువ హాని కలుగ చేస్తాయని చెప్పారు. క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వేమూరి జయరాం ప్రసాద్, సభ్యుడు శివాజీ, సామాజిక కార్యకర్తలు మార్కండేయ, ధరణి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 84,173 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,519 మంది తలనీలాలు సమర్పించారు.

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 28: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడు తిరుత్తణితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం సోమ, మంగళవారాల్లో తిరుపతి-తిరుత్తణి వయా నగరి మీదుగా, పచ్చికాపల్లం-తిరుత్తణి వయా కె.నగరం 20, పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, నగరి-తిరుత్తణి 5, కొత్తపల్లెమిట్ట-తిరుత్తణి వయా నగరి 15, పుత్తూరు వయా పల్లెపట్టు 6, సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 15, నాగులాపురం-తిరుత్తణి 5, తిరుపతి-పాకాల 5 బస్సులు నడవనున్నాయి. మంగళవారం భక్తుల రద్దీకనుగుణంగా ఈ సంఖ్యను తగ్గించే అవకాశాలున్నాయి. ఆదివారం భరణి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన 65 ప్రత్యేక బస్సులకు భక్తుల ఆదరణ లేకపోవడం గమనార్హం.

వెంకన్న సేవలో ప్రముఖులు



జస్టిస్ కృష్ణకుమార్ తదితరులు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వైసీపీ ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, పోతుల సునీత, దువ్వాడ శ్రీనివాస్, రమేష్‌యాదవ్, ఐపీఎస్ అధికారులు సుబ్బరాయుడు, పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేకదర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు గంగమ్మ గుడిలో దుకాణాల వేలం

తిరుపతి (కల్చరల్), జూలై 28: తిరుపతి గంగమ్మ గుడిలోని పలు దుకాణాలకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే వస్త్రాలను పొందే హక్కు వేలం కూడా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమౌతుంది. ఆసక్తి గలవారు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చు.

మాతమ్మను దర్శించుకున్న ఆరణి



తిరుపతి అర్బన్, జూలై 28: స్థానిక పార్వతీపురంలోని మాతమ్మ కొలుపు వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వెంకటేష్ ఘనంగా స్వాగతం పలకగా, పూజారి రాధాకృష్ణయ్య పూజలు నిర్వహించి, ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వస్తున్న మాతమ్మ కొలుపు సంప్రదాయాన్ని ఇక్కడ ప్రజలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు రామాయాదవ్, గణపతి నాయుడు, వాణి, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఆనంద్, హేమకుమార్, కొండారాజు, రుద్రకిషోర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28: ఎస్వీయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పరిశోధకురాలు డి.సుజాత డాక్టరేట్ పొందారు. కాంట్రిబ్యూషన్ ఆఫ్ నాసా సైంటిస్ట్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్ అండ్ ఏరోస్పేస్ కలెక్షన్ ఏ బిబిలియోమెట్రిక్ స్టడీ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ పద్మిని పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28: ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంధం బాబును టీడీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి రాజయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటముని తదితరులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 30వ డివిజన్ అధ్యక్షుడు మునికృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు శివరామకృష్ణ, హరి, మురగనాయక్, గోవిందాచారి, రామచంద్రుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాఫ్ట్‌టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), జూలై 28: స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు వచ్చేనెల 4, 5తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ● బాలుర విభాగంలో బి.కరుణకుమార్, ఆర్.విశాల్‌రాజ్, బి.జయసాయికుమార్, ఎన్.మునిహిమసాయి, ఎం.జీవన్, టి.గురురోహిత్, మునిపురంధర్, వై.గౌతంకృష్ణ, రిజర్వ్‌డ్ విభాగంలో ఎస్.సూరజ్, ● బాలికల విభాగంలో బి.మహిత, కె.చందన, సి.హెచ్.చైతన్య, ఎం.చాందినిని ఎంపిక చేసినట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సుధీర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ పాల్గొని రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



విజేత 'పృథ్వీరాజ్ రాసో'

ముగిసిన హనుమ అవార్డుల వేడుక



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు, శ్రీపద్మావతీ శ్రీనివాస కల్యాణం పద్యనాటకం

తిరుపతి (కల్చరల్), జూలై 28: గత పది రోజులుగా తిరుపతిలోని మహతి వేదికలో అలరించిన హనుమ అవార్డుల సాంస్కృతిక పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా పద్య నాటకాలలో పృథ్వీరాజ్ రాసో నాటకం మొదటి బహుమతి (రూ.50 వేలు నగదు, రోలింగ్ షీల్డు)ని గెలుచుకోగా, సాంఘిక నాటికల విభాగంలో ఇంద్రప్రస్థ ప్రథమ బహుమతిని అందుకుంది. తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలలో భాగంగా సాయంత్రం జరిగిన సభలో విజేతలను ప్రకటించారు. పద్య నాటకాలలో రెండవ బహుమతిని శ్రీకృష్ణకమలపాలిక, మూడవ బహుమతిని మైరావణ నాటకాలకు అందజేశారు. పద్య నాటకాలలో ఉత్తమ నటుడుగా శ్రీకాళహస్తి మహత్యం నాటకంలో నటించిన నక్కీరుడు పాత్రధారి మెట్టదామోదర రావు అందుకున్నారు. ఉత్తమ నటిగా శ్రీకృష్ణకమలపాలిక నాటకంలోని హిడింబి పాత్రధారిణి సురభి ప్రభావతి, ఉత్తమ ప్రతి నాయకుడుగా మైరావణ పాత్రధారి రఘురామశర్మ బహుమతులు అందుకున్నారు. సాంఘిక నాటికలలో ఉత్తమ నటుడుగా ఇంద్రప్రస్థ నాటికలో నటించిన రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటి గా చీకటిపువ్వు నాటికలో పాత్రధారి లహరి, బహుమతులను అందుకున్నారు. సాంఘిక నాటికలలో రెండవ బహుమతిని నిశ్శబ్ధమా నీఖరీదెంత, మూడవ బహుమతిని చీకటిపువ్వు అందుకున్నాయి. తిరుపతికి చెందిన ప్రముఖ కళాకారుడు, గాయకుడు ధర్మయ్యను అభినయ ఆర్ట్స్ తరపున సాహితీపారిజాత పురస్కారంతో సత్కరించారు. 10రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మూడు వేలమంది కళాకారులు, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. చివరిరోజు ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన శ్రీపద్మావతీ శ్రీనివాస కల్యాణం పద్యనాటకం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి బియన్‌రెడ్డి, డాక్టర్ పార్థసారథిరెడ్డి, డాక్టర్ హరిప్రసాద్, రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గోపినాథరెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, వ్యాపారవేత్త దుగ్గాండ్ల కుమారస్వామిరెడ్డి, ఆచార్య రూపేష్‌కుమార్‌రెడ్డి, నటుడు, దర్శకుడు గజేంద్ర, మిమిక్రీ కళాకారుడు విజయకుమార్, ఇరమునిశేఖర్, శాంబోలు హరనాథ్, బొందు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ కళాకారుడు ధర్మయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు, పద్య నాటకం, సాంఘిక నాటిక అవార్డులు అందుకుంటున్న కళాకారులు

తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాలను, దర్శన క్యూలైన్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆళ్వార్ ట్యాంక్ అతిథిగృహాల వద్దనున్న ఎస్‌ఎస్‌డీ క్యూలైన్, టోకెన్ తనిఖీ కేంద్రాలను పరిశీలించారు. తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1, 2లోని కంపార్టుమెంట్లు, సుపథం వద్ద చిన్నపిల్లల తల్లిదండ్రులు, దాతలతో పాటు వివిధ దర్శనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎస్ఈడీ క్యూలైన్, ఫొటో క్యాప్చర్ తదితర అంశాలను పరిశీలించారు. అదనపు ఈవోతో పాటు ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవోలు లోకనాథం, ఆశాజ్యోతి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవోలు నందకిషోర్, గిరిధరరావు పాల్గొన్నారు.

పేరూరులో ముగిసిన మహాభారత ఉత్సవాలు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే నానీ తదితరులు

తిరుపతి(విద్య), జూలై 28: తిరుపతి రూరల్ మండలం పేరూరులోని శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరాజులస్వామి ఆలయంలో 19రోజులపాటు నిర్వహించిన మహాభారత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈఉత్సవాల్లో చివరిరోజు అగ్నిగుండ ప్రవేశ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాసదీక్షలతో అగ్నిగుండ ప్రవేశాన్ని చేసి స్వామివారిని దర్శించుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు, కమిటీ నాయకులు సాదర స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



కార్యక్రమానికి హాజరైన అతిథులు

తిరుపతి(క్రీడలు), జూలై 28: స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ఆదివారం 24వ చిత్తూరు జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 బాలబాలికల సబ్ జూనియర్, ఓపెన్ క్యాడెట్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి శంకర్‌యాదవ్ హాజరై క్రీడాకారులకు విలువైన సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. జయరామయ్య, విజయ్‌కుమారి, క్రాంతికుమార్, మనోహర్ నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బురదజల్లేలా వ్యహరిస్తోంది

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కనీసం గంట కూడా పదవిలో లేకుండా మాజీ సీఎం జగన్ ఉండలేని పరిస్థితిలో ఉన్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 36 మంది వైసీపీ నాయకులను హత్య చేశారని జగన్ ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. ఎవరు చనిపోయారు, వారి పేర్లు చెబితే విచారణ చేయిస్తామని పలుమార్లు సీఎం చెప్పినా సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. కేవలం బురద చల్లేసి కడుక్కోండనే విధంగా జగన్ వ్యవహారం ఉందన్నారు. ప్రభుత్వంలో ఏదైనా లోటుపాట్లు ఉంటే ప్రశ్నించేలా ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో తాము కూడా కౌన్సిల్‌లో అనేక ప్రజా సమస్యలపై ప్రశ్నించామన్నారు. గతంలో టీటీడీలో అనేక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. గతేడాది శ్రీవారి పరకామణిలో వందల కోట్ల కుంభకోణం జరగడం ఇటీవల బయటపడిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చ జరిగినప్పుడు మంత్రి ఆనం విచారణ చేయిస్తానని చెప్పారన్నారు.

వచ్చే నెలలో 'పెళ్లి కాని ప్రసాద్' విడుదల

- హీరో సప్తగిరి



సప్తగిరి, గురజాల జగన్మోహన్

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను నటించిన 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా ఆగస్టులో విడుదల అవుతుందని హీరో సప్తగిరి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా చూస్తే అందరికీ పెళ్లి అవుతుందని నవ్వుతూ అన్నారు. ఈచిత్రంతో పాటు 'గోల్డ్‌మెన్' అనే చిత్రంలో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. 'పెళ్లి కాని ప్రసాద్' స్క్రిప్ట్‌ను చిత్తూరు ఎమ్మెల్యే ఓకే చేశారన్నారు. ఇక, 'మా' ఎన్నికల గురించి మీడియా ప్రశ్నించగా, తప్పకుండా అన్నిటిలో మా ముద్ర ఉంటుందన్నారు. తర్వాత రాజకీయాల ప్రవేశంపై స్పందిస్తూ ఎంపీ సీటు కోసం ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ.. చిన్నపిల్లోడిని అప్పుడే ఎందుకు రాజకీయాలు అని, తర్వాత చూద్దాం అనుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఎక్కడికక్కడ తిరుమలలో పరిశుభ్రత పెరగడంతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోందన్నారు. సీఎం ఆదేశాలతో వచ్చిన అధికారులు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఈ దేవస్థానాన్ని ఇంకా ఉన్నత స్థానానికి తీసుకువెళతారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి(క్రీడలు), జూలై 28: చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. అధ్యక్షుడిగా కె.మెహర్‌శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా వై.ఆనందరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.రామకృష్ణయ్య, ట్రెజరర్‌గా జి.శివయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్.సుధాకర్‌రావు, ఇతర కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు.

ఉద్యానవనం అందుబాటులోకి వచ్చేనా?



మూతపడిఉన్న ఉద్యానవనం

సూళ్లూరుపేట, జూలై 28: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో జాతీయ రహదారి పక్కనే మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద రూ.49.85 లక్షలతో ఎన్.చంద్రబాబు నాయుడు ఉద్యానవనం ఏర్పాటుకు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేశారు. మూడు ఎకరాల్లో పార్కు పనులు పూర్తయ్యాయి. అనంతరం టీడీపీ అధికారం కోల్పోవడంతో పార్కు గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో నేటికీ ప్రారంభం కాకపోవడంతో పట్టణవాసులకు ఆహ్లాదం కరువైంది. ప్రస్తుతం ఆ ప్రదేశమంతా పిచ్చిమొక్కలతో నిండి పోయింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఇకనైనా పార్కును ప్రారంభించి అందుబాటులోకి తేవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రేపు ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు, జులై 28 : మండల పరిధిలోని మల్లాంలో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30న ఆడికృత్తిక వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం నూరు స్తంభాల కల్యాణ మండపంలో పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులు నాలుగు పూలమాలలు, ఐదు రకాల పండ్లు, విడిపూలు సమర్పించాలని కోరారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించి పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

వచ్చే నెల్లో 'పెళ్లి కాని ప్రసాద్' విడుదల

హీరో సప్తగిరి



సప్తగిరి, గురజాల జగన్మోహన్

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను నటించిన 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా ఆగస్టులో విడుదల అవుతుందని హీరో సప్తగిరి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా చూస్తే అందరికి పెళ్లి అవుతుందని నవ్వుతూ అన్నారు. అలాగే ఈచిత్రంతో పాటు 'గోల్డ్‌మెన్' అనే చిత్రంలో కూడా నటిస్తున్నట్టు తెలిపారు. 'పెళ్లి కాని ప్రసాద్' స్క్రిప్ట్ చిత్తూరు ఎమ్మెల్యే ఓకే చేశారన్నారు. ఇక, 'మా' ఎన్నికల గురించి మీడియా ప్రశ్నించగా తప్పకుండా అన్నిటిలో మా ముద్ర ఉంటుందన్నారు. తర్వాత రాజకీయాల ప్రవేశంపై స్పందిస్తూ ఎంపీ సీటు కోసం ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ.. చిన్న పిల్లోడిని అప్పుడే ఎందుకు రాజకీయాలు అని తర్వాత చూద్దాం అనుకున్నట్టు చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఎక్కడికక్కడ తిరుమలలో పరిశుభ్రత పెరగడంతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోందన్నారు. సీఎం ఆదేశాలతో వచ్చిన అధికారులు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఈదేవస్థానాన్ని ఇంకా ఉన్నత స్థానానికి తీసుకువెళతారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తి



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తమిళనాడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీటీఎం

నాయుడుపేట, జూలై 28: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి చెప్పారు. ఆయన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను సూళ్లూరు పేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున, సిబ్బందితో పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆటోలు, ఇతర వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు రాకపోకలు సాగిస్తున్నట్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలు లేనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. బస్టాండ్‌లోని స్టాళ్లలో తినుబండరాలు, వాటర్‌బాటిళ్లు ఎంఆర్‌పికే విక్రయించాలన్నారు. సీటీఎం వెంట నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ శంకర్ ఉన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వంతో బీమా భరోసా



వివరాలు వెల్లడిస్తున్న ప్రవీణ్

నాయుడుపేట, జూలై 28: జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు రూ.5లక్షల బీమా భరోసా ఉంటుందని ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ చెప్పారు. నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించిన అనంతరం జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదున్ను చేపట్టారు. న్యాయవాది వి.పార్థసారథి రెడ్డి సహా పలువురు సభ్యత్వం తీసుకున్నారు.

మల్లికాంబ దేవస్థానంలో మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్, జూలై 28: పట్టణంలోని స్వర్ణముఖినది ఒడ్డున కొలువై ఉన్న మల్లికాంబ దేవస్థానంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని దేవస్థాన నిర్వాహకుడు ఆమాస వెంకట రామనారాయణ ప్రారంభించారు. నాయుడుపేట, పరిసర ప్రాంతాల నుంచి పలువురు హాజరై వైద్య పరీక్షలు చేయిం చుకున్నారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. అలాగే చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. డాక్టర్లు ప్రవీణ్యాదవ్, మునిరాజ, మునిరత్నం, టీడీపీ నాయకులు జి.సుధీర్ రెడ్డి, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు అర్బన్, జూలై 28: స్థానిక జనార్దన రెడ్డి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.5వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు టి.చంద్రమౌళి, పైనంపాటి మోహన్, కాశీ అందజేశారు.

హై లెవల్ వంతెనల నిర్మాణం కలేనా?

గూడూరు, జూలై 28: భారీ వర్షాల సమయంలో చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. యేటా ఏదో ఒక తుఫాన్ సమయంలో భారీ వర్షాల కారణంగా చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో తగ్గే వరకు పలు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నారు. పడవల సాయంతో సంబంధిత గ్రామాలకు చేరుకుని సహాయచర్యలు చేపడుతుంటారు. కొన్ని గ్రామాల వద్ద చప్టాలు దాటే సమయంలో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వైసీపీ పాలనలో చప్టాలపై హైలెవెల్ వంతెన నిర్మాణం చేపడుతామని ప్రజాప్రతినిధులు చెప్పినా.. ఆ తరువాత పట్టించుకోలేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

- గూడూరు మండలం వేములపాళెం సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తే విందూరు, రామలింగాపురం, చెంబడిపాళెం, సంతదాసుపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.
- చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం సమీపంలోని చప్టాపై నీరు పారిందంటే ఈ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోతుంది. పడవల సాయంలో గ్రామస్తులకు నిత్యావసరాలను అందించాల్సి వస్తోంది.
- వాకాడు మండలం గంగన్నపాళెం సమీపంలోని చప్టాపైకి నీరు పారితే పామంజి, వాలమేడు, జమీన్‌కొత్తపాళెం తదితర 12కు పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పంబలి సమీపంలో చప్టాపై నీరు ప్రవహిస్తే కాకివాకం, శ్రీనివాసపురానికి రాకపోకలు నిలిచిపోతాయి.
- కోట మండలం గోవిందపల్లి, గూడలి గ్రామాలకు వెళ్లే చప్టాల పరిస్థితి ఇదేవిధంగా ఉంది.
- చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి వద్ద చప్టా జలదిగ్బంధంలో చిక్కుకుంటే నియోజకవర్గంతో సంబంధాలు తెగిపోతాయి.

ఇకనైనా అధికారులు స్పందించి నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాల సమయంలో జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్న గ్రామాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో చప్టాల స్థానంలో హైలెవెల్ వంతెనలను నిర్మించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామీణులు కోరుతున్నారు.



వేములపాళెం వద్ద, తిప్పగుంటపాళెం చప్టాలపై ఉధృతంగా పారుతున్న నీరు (ఫైల్‌ఫొటోలు)

డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత

రోగులకు అందని మెరుగైన వైద్యం ● దంత వైద్యుడు ఎప్పుడొస్తారో?



డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రి- ఆసుపత్రిలో మూతవేసి వున్న దంత వైద్యుడి గది

డక్కిలి, జూలై 28: సార్ ! పంటి డాక్టర్ ఎప్పుడొస్తారు... ఎప్పుడు వచ్చినా ఆ తలుపు మూసే ఉంటుంది... అన్న ప్రశ్నలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. రోజూ 100 నుంచి 150 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నా ఒకే నర్సు సేవలందిస్తోంది... ఇంత మంది బాగోగులు ఒకరే చూడాలంటే కాస్తంత చిరాకు ఉంటుంది కదా... అని రోగులే సర్దుకు పోతున్నారు. ఉన్న ఇద్దరు డాక్టర్లలో ఒకరు ఓపీలో రోగులకు వైద్యం అందిస్తుండగా మరొకరు ఫీల్డ్‌కు వెళ్లి వైద్యసేవల్లో నిమగ్నమవుతారు. గతంలో ఐదారుగురు డాక్టర్లు, ఆరేడుగురు నర్సులతో కళకళలాడిన డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదన్న విమర్శలు మూటగట్టుకుంటోంది.

డక్కిలిలో 30 పడకల ఆసుపత్రి 1992లో అప్పటి సీఎం ఎన్.జనార్దన రెడ్డి చొరవతో ఏర్పాటైంది. అప్పట్లో తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉండటంతో రోజూ ఓపీ 200 నుంచి 300 వరకు ఉండేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైద్యులు, సిబ్బందిని బాగా తగ్గించేశారు. ఐదుగురు వైద్యుల స్థానంలో పంటి డాక్టరుతో కలిపి ముగ్గురికి కుదించారు. ఐదుగురు స్టాఫ్‌నర్సులకు గాను ముగ్గురికి చేరింది. వీరు మూడు షిఫ్టుల్లో ఒక్కరు మాత్రమే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇక పంటి సమస్యతో ఆసుపత్రికి వచ్చే రోగులకు దంత డాక్టర్ దర్శనమే కరువు అవుతోందని వాపోతున్నారు. ఈయన వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే కనిపిస్తారని రోగులు చెబుతునానరు. ఆ రెండు రోజులు కూడా ఏ రోజు వస్తారో కూడా తెలియడం లేదని వాపోతున్నారు. ఇక రాత్రి వేళల్లో ప్రజలకు వైద్య సేవలు అవసరమైతే ఇక్కడ వైద్యులు అందుబాటులో ఉండరన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈ ఆసుపత్రిలో ఉదయం వైద్య సేవలు కూడా ఆలస్యంగా మొదలవుతాయని రోగులు చెబుతున్నారు. ఇక ఆసుపత్రి డీసీఎస్ (డిప్యూటీసివిల్ సర్జన్)గా పనిచేస్తున్న హరిత అనే సీనియర్ వైద్యు రాలు తిరుపతి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఆరు నెల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లారు. అక్కడి బాధ్యతలు నిర్వహిస్తునే ఇక్కడి ఆసుపత్రిని పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ఆమె గత ఆరు నెలల్లో ఒక్క రోజు కూడా ఈ ఆసుపత్రికి వచ్చినట్టు దాఖలాలు లేవంటున్నారు. డ్రాయింగ్ అధికారిగా కావడంతో ఈ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది జీతభత్యాల బిల్లుకు ఆమె సంతకం కోసం తిరుపతికి పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇక్కడి ఆసుపత్రి పరిస్థితి మారలేదని స్థానికులు వాపోతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ పరిధిలో పనిచేసే ఆరోగ్య సిబ్బందిలో కొందరు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

పల్స్‌పోలియో సిబ్బందికి అందని గౌరవవేతనం!

ఈ ఏడాది మార్చి 3,4,5 తేదీల్లో డక్కిలి మండలంలో పల్స్ పోలియో జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బంది కలిసి మొత్తం 244 మంది పనిచేశారు. ఇందుకు గాను వారికి ప్రభుత్వం గౌరవ వేతనం కింద మార్చి నెలలోనే రూ.54,900 మంజూరు చేసింది. అయితే ఈ గౌరవ వేతనం ఇతర మండలాల్లో అప్పుడే అందచేయగా డక్కిలిలో మాత్రం ఇప్పటివరకు అందచేయలేదు. ఇదే విషయమై డీసీఎస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా... ఇవ్వాలి... ఇస్తాం... అంటూ సమాధానం చెప్పారు.

మల్లెకు నేరేడుకాయ తెగులు

రాలిపోతున్న మొగ్గలు ● లబోదిబోమంటున్న రైతులు



కేశవరంలో సాగులో ఉన్న మల్లెతోట - తెగులు సోకడంతో రాలిపోయిన మొగ్గ

కోట, జూలై 28: మల్లెసాగుతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్న సన్న, చిన్నకారు రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. సీజన్‌లో అత్యధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చేతి కొచ్చిన పంటకు నేరేడుకాయ తెగులు ఆశించడంతో కళ్ల ముందే మొగ్గలు రాలి పోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోట మండలంలోని మెట్ట గ్రామాలైన కొండుగుంట, కేశవరం, రాఘవాపురం, సిద్ధమ్మకండ్రిగ, రామాపురం, మద్దాలి, మద్దాలి కండ్రిగల్లో దశాబ్దాలుగా రైతులు మల్లె తోటలను సాగుచేసి జీవనం సాగిస్తున్నారు. అర ఎకరం నుంచి రెండెకరాల్లో చిట్టి మల్లెలు సాగు చేస్తున్నారు. మల్లెలు విక్రయించి వచ్చిన డబ్బుతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రస్తుత సీజన్‌లో మల్లెలకు డిమాండ్ ఉన్నప్పటికీ నేరుడుకాయ తెగులు సోకడంతో మొగ్గలు ఎర్రగా పాలిపోయి మరకలు ఏర్పడి ఒకట్రెండు రోజుల తరువాత రాలిపోతున్నాయి. ప్రస్తుతం కిలో చిట్టి మల్లెలు రూ. 400 నుంచి రూ.500 వరకు విక్రయమవుతున్నాయి. ధర ఉన్నప్పుడు మొగ్గలు రాలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ మల్లె రైతులకు కంటతడి మిగిల్చింది.

ఐటీపై టీటీడీ ప్రత్యేక దృష్టి

అక్రమార్కులకు చెక్‌పెట్టేందుకు చర్యలు
రాండమ్ బుకింగ్స్ అడ్డుకునేందుకు ప్రణాళిక
ఫేక్ ఆధార్‌పై కసరత్తు



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) విభాగ అభివృద్ధిపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ సేవలను మరింత అభివృద్ధిపరిచి అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు టీటీడీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సేవలను సామాన్య భక్తులే పొందేలా చర్యలు తీసుకుంటోంది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రతి నెలా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జితసేవలు, గదుల కోటాను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతమున్న ఐటీ వ్యవస్థలోని లోపాలను అవకాశంగా తీసుకున్న కొంతమంది ఆ సేవలేవీ సామాన్యులకు అందకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు వివిధ విభాగాలతో పాటు ఐటీ విభాగంపై కూడా దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఐటీ విభాగంలో అనేక లోపాలు ఉన్నట్టు గుర్తించారు.

ఒకే నంబరు, మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు

సామాన్య భక్తులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో టీటీడీ కొన్ని ఆర్జితసేవలను రెండుగా విభజించింది. అందులో ఒకటి మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన కొన్ని సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నారు. మరికొన్ని ఆర్జిత సేవలను ఆన్‌లైన్ లక్కీడిప్ ద్వారా కేటాయిస్తున్నారు. లక్కీడిప్ రిజిస్ట్రేషన్‌కు రెండురోజుల వ్యవధి ఇస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాలో కొన్నింటిని రాండమ్‌గా ఎంపిక చేసి భక్తులకు సమాచారాన్ని అందజేసి నగదు చెల్లింపునకు మరో రెండురోజుల సమయం ఇస్తారు. అయితే కొంతమంది దళారీలు, టెక్నాలజీపై కాస్త పట్టు ఉన్న వ్యక్తులు ఐటీలోని లోపాలు గమనించి ప్రతి నెలా కొన్ని ఆర్జితసేవా టికెట్లను పొందుతున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా తమకు ఆర్జితసేవలు అందడం లేదని తరచూ పలు ప్రాంతాల నుంచి భక్తులు టీటీడీకి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈనేపథ్యంలో టీటీడీ ఉన్నతాధికారుల పరిశీలనలో నివ్వెరపోయే విషయాలు వెలుగుచూశాయి. ఇందులో ప్రధానంగా ఒకే సెల్ నెంబరు, ఒకే మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గుర్తించారు. ఒకే వ్యక్తి 1,800 సార్లు రిజిస్ట్రేషన్ చేసి 60 సార్లు డిప్ ద్వారా సేవా టికెట్లు పొందడం ఐటీ విభాగ వైఫల్యమేనని అధికారులు గుర్తించారు. అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటే ఏదో ఒక ఆర్జితసేవ డిప్ ద్వారా రావడం ఖాయమని భావించిన కొందరు వ్యక్తులు ఇతరులెవరికీ సేవలందకుండా చేస్తున్న క్రమంలో టీటీడీ ఒకే నెంబరు, మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న జాబితాను ఇటీవల తయారు చేసింది. ఈ తరహాలో పొందిన బుకింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు ఆయా నెంబర్లు, మెయిల్స్ బ్లాక్ చేశారు. ఇదే తరహాలో గదులు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు పొందిన వారి బుకింగ్స్‌ను కూడా రద్దు చేశారు. ఇకపై తరచూ వచ్చే నెంబర్లు, మెయిల్స్‌పై దృష్టి పెట్టాలని విజిలెన్స్ అధికారులు సూచించడంతో పాటు ఒకసారి బుకింగ్‌కు వినియోగించిన నెంబరు, మెయిల్ మళ్లీ 90 రోజుల పాటు బుకింగ్‌కు ప్రవేశం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు.

ఇకపై ఫేక్ ఆధార్లకు నో ఎంట్రీ

భక్తులు ఇస్తున్న ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థ టీటీడీలో లేకపోవడం దళారీల పాలిట వరంలా మారింది. దీంతో ఫేక్ ఆధార్ కార్డులతో చాలా మంది ఇష్టానుసారం దర్శనం, ఆర్జితసేవలు, గదులు పొందుతున్నారు. ఇటీవల అనంతపురానికి చెందిన వ్యక్తి ఇతర భక్తుల ఆధార్‌లో ఫొటోను, నెంబర్లను మార్చి ఒకే నెలలో 28 గదులు పొందాడు. ఇలా దాదాపు 25 మంది దళారీలు ఫేక్ ఆధార్లతో గదులు పొంది భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు 26 రోజుల క్రితం వెలుగు చూసింది. ఈ క్రమంలో ఫేక్ ఆధార్లను అరికట్టేందుకు టీటీడీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులోభాగంగా గతనెల 29వ తేదీన టీటీడీ ఈవో యూఐడీఏఐ(ఆధార్ సంస్థ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పాదర్శకతతో పాటు దళారీలను అరికట్టవచ్చని అభిప్రాయంతో యూఐడీఏఐ అధికారుల సహకారం కోరారు. దీనికోసం ప్రత్యేకంగా ఓ అప్లికేషన్‌ను రూపొందించి ఆధార్ సంస్థ సర్వీసును పొందాలని భావిస్తున్నారు. దీనికి ఆధార్ సంస్థ కూడా సానుకూలంగా స్పందించింది. తద్వారా భక్తులు అందజేసే ఆధార్ నిజమైనదా కాదా అనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. గతంలో ఐటీ విభాగంలో సూపరింటెండెంట్ ర్యాంక్‌లో జీఎం పోస్టును క్రియేట్ చేసి ఓ వ్యక్తిని నియమించినప్పటికీ ఆయనకు ఉండాల్సిన అర్హతలు లేవని ఈవో అభిప్రాయపడ్డారు. ఆ పోస్టులో అనుభవం ఉన్న వ్యక్తిని నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు సర్వీసు ఇస్తున్న జియో, టీసీఎస్ సంస్థలకు నూతన టార్గెట్లు ఇచ్చే దిశగా కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం

సూళ్లూరుపేట, జూలై 28: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ 2024-25 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సుధాకర్ రెడ్డి, కార్యదర్శిగా కొండా రామకృష్ణ సహా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని పాల్ హ్యారీస్ ఫెలో హాల్‌లో రోటరీ మాజీ జిల్లా గవర్నర్ కె.మునిగిరీష్ ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజయశ్రీ విచ్చేసి తడ మండలం వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కోట, జూలై 28: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం జరిగింది. తిరుపతికి చెందిన ఎస్వీ అరవింద నేత్రాలయ సహకారంతో కంటి వైద్య నిపుణులు గౌతమి, కీర్తి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 60 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 60 మందికి కంటి అద్దాలు, మందులు అందించారు. ట్రస్టీ గౌరీశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి దర్శనం



కోట, జూలై 28 : కోట పట్టణంలో కొలువై ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 40 రకాల కూరగాయాలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందనా, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వేనాడులో గ్రామ దేవతకు అంబళ్లు



అంబళ్లు పోస్తున్న గ్రామస్తులు

తడ, జూలై 28: ఆడిమాసం రెండో వారం కావడంతో మండల పరిధిలోని వేనాడులో ఆదివారం గ్రామస్తులు గ్రామ దేవతకు అంబళ్లు పోసే కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. గ్రామంలో ఇంటిల్లిపాదితో పాటు గ్రామ వీధుల్లో వేపాకు తోరణాలు కట్టి గ్రామ దేవతలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి అంబళ్లు పోశారు. అనంతరం గ్రామ దేవతలతో గ్రామ వీధుల్లో మేళ, తాళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ నడిబొడ్డున నైవేద్యం సమర్పించారు. సాయంత్రం గంగమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు వడపొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

వేమాలమ్మ గ్రామోత్సవం



నాయుడుపేట, జూలై 28: మండలంలోని కూచివాడలో గ్రామ దేవత వేమాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, సామూహిక పొంగళ్లను పెట్టారు. గ్రామం నుంచి ఇతర పట్టణాల్లో, ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు ఉన్నారు. వారందరూ వేమాలమ్మ పొంగళ్ల సమయానికి స్వగ్రామానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేమాలమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామెత్సవం నిర్వహించారు.

వైభవంగా చండికా పరమేశ్వరి దేవి ఉత్సవాలు

పెళ్లకూరు, జూలై 28: మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో కొలువై ఉన్న చండికా పరమేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు రకాల పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం స్వస్తివాచకం, బింబాభిషేకం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, గోపూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, జూలై 28: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దాడిపై కేసు నమోదు

సూళ్లూరుపేట, జూలై 28: పట్టణంలోని కోళ్లమిట్టకు చెందిన సాయిపై అదే ప్రాంతానికి చెందిన గౌతమ్ తన స్నేహితుడితో కలిసి దాడి చేశారు. ఎస్‌ఐ రహీం రెడ్డి తెలిపిన వివరాలు... కోళ్లమిట్టకు చెందిన ఇద్దరి మధ్య పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గౌతమ్ కోళ్లమిట్ట సమీపంలోని మోర్‌మార్కెట్ వద్ద వెళ్తుండగా సాయి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆగ్రహించిన గౌతమ్ తన స్నేహితుడు గిరీష్‌తో కలిసి సమీపంలో ఉన్న బిర్యానీ ప్యాలెస్ వద్ద సాయిపై దాడి చేశాడు. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నాయుడుపేట టౌన్, జూలై 28 : పట్టణంలోని సంజాయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి ఇందిరా సిల్క్ యజమాని ఫ్యాన్ సహా నిత్యావసరనిత్యవసర సరుకులను ఆదివారం అందజేశారు. వృధాశ్రమానికి అవసరమగు చేయూతను తాము అందిస్తామని దిలీప్ తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, జూలై 28: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ సహకారంతో 25 మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. వెంకటకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాధమ్మ, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

విజ్ఞానగిరిపై నేడు ఆడికృత్తిక ఉత్సవం


విద్యుత్ దీపకాంతుల్లో విజ్ఞానగిరి ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 28: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా వేకువజామునే స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్లకు ఇంద్ర విమాన సేవ, రాత్రి మయూర వాహన సేవ జరగనుంది. ఆడికృత్తిక సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్టు ఈవో మూర్తి తెలిపారు. కాగా, కొండపైన ఆలయాన్ని, కొండకింద రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమనానంగా అలంకరించారు.

గుడిమల్లం ఆలయంలో...

ఏర్పేడు, జూలై 28: గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ మాజీ ఛైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకునే భక్తులకు, కావిడి మొక్కులు చెల్లించే భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

యాళి వాహనంపై కుమారస్వామి రాజసం



శ్రీకాళహస్తి, జూలై 28: శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆదివారం ఉదయం యాళి వాహనంపై ఊరేగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం భరణి ఉత్సవం జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల యాళి వాహనంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరజనాలు సమర్పించారు. రాత్రి శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి శేషవాహనంపై ఊరేగారు. కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలి


ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 28: రాచగున్నేరిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో మృతి చెందిన మద్దు ప్రసాద్‌ను యాజమాన్యం ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఆదివారం ప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రసాద్ మృతి చెందాడన్నారు. అతని కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్ మణి, మురళి, రొడ్డ గోపి, మోహన్‌రెడ్డి, గురవయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి


సమావేశంలో మాట్లాడుతుతున్న చంద్రశేఖర్

పుత్తూరు టౌన్, జూలై 28: కార్మికులు ఐక్యంగా ఉండి, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు డివిజన్ ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, మహేష్, హేమావతి, ముకుంద, రమణ మారెమ్మ, వెంకటరమణమ్మ, రమేష్, సుబ్రమణి, గోపి, నెలవరాజా ఆచారి, కృష్ణారెడ్డి, ఇందిర, శరవణ, విజయ్, ధనమ్మ, కైలాసం, శీను, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నాగరత్న


ఏపీ గౌడ సమాఖ్య కార్యవర్గ సభ్యులు

పుత్తూరు టౌన్, జూలై 28: గౌడ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పుత్తూరుకు చెందిన నాగరత్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదారాబాదులో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గౌడ సమాఖ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగరత్న మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో గౌడ కుల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

జనసేన సభ్యత్వానికి విశేష స్పందన


సభ్యత్వ నమోదులో జనసైనికులు

వడమాలపేట, జూలై 28: జనసేన సభ్యత్వానికి విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్ చెప్పారు. ఆదివారం మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. మండలంలో జనసేన సైనికులుగా సుమారుగా 350 మందికి పైగా క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకున్నారని చెప్పారు.

గోవిందనామ స్మరణ సర్వపాప హరణం

వడమాలపేట, జూలై 28: గోవిందనామ స్మరణ సర్వపాపహరణం అని శ్రీ భగవత్ సేవా సమితి వ్యవస్థాపకుడు రాజగోపాల్ స్వామి చెప్పారు. ఆదివారం తమిళనాడులోని మాధవరం నుంచి శ్రీభగవత్ సేవా సమితి ఆధ్వర్యంలో విచ్చేసిన గోవింద భక్తులకు వడమాలపేటకు చెందిన శ్రీనివాసులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, నాగయ్య, సత్తర్, పెరుమాల్ నాయుడు, పద్మనాభం, సుబ్రహ్మణ్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

శ్రీకాళహస్తి, జూలై 28: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు(25) మృతి చెందిన ఘటన ఆదివారం వేకువజామున శ్రీకాళహస్తి పట్టణంలోని స్కిట్ కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు... పట్టణంలోని స్కిట్ కళాశాల వెనుక వైపున గుర్తు తెలియని యువకుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచ్ టూల్ అబ్జర్వర్‌గా సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, జూలై 27: ఏర్పేడు మండలం బండారుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యం టీచ్ టూల్ అబ్జర్వర్‌గా నియమితుయ్యారు. ఆయనను ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్, ఉపాధ్యాయులు గుణశేఖర్‌రెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, కుమారరాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు అభినందించారు.

భయపెడుతున్న శిథిల భవనాలు

గురుకులం విద్యార్థులకు పొంచివున్న ప్రమాదం


పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల భవనాలు

సత్యవేడు, జూలై 28: సత్యవేడులోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురకుల పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఆవరణలోని శిథిల భవనాలతో ప్రమాదం పొంచివుంది. స్థానిక బాలుర గురుకుల పాఠశాలను 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయంలో ప్రారంభించారు. అప్పట్లో పాఠశాలను పట్టణంలోని తెలుగు గంగ డివిజన్ కార్యాలయ ఆవరణలోని రేకుల షెడ్డులో తాత్కాలికంగా ప్రారంభించారు. అనంతరం శాశ్వత భవన నిర్మాణాలు జరిగి ప్రస్తుతం పూర్తి స్థాయి వసతులతో పాఠశాల నడుస్తోంది. పాఠశాలలో ఐదు నుంచి పదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు తదితర జిల్లాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తల్లితండ్రులను వదిలి గురుకులంలో ఉంటున్న చిన్నారులకు పాఠశాల ఆవరణలోని పాడుబడిన భవనాలు భయపెడుతున్నాయి. పాఠశాల ఆవరణలో తెలుగు గంగ కార్యాలయానికి సంబంధించిన పురాతన భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. అప్పట్లో తెలుగు గంగ కాలువ నిర్మాణ సమయంలో స్థానిక సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో ఎన్ఎంకండ్రిగ వద్ద తెలుగుగంగ అధికారులు, సిబ్బంది నివాసం ఉండేందుకు పదుల సంఖ్యలో నివాస గృహాలను నిర్మించారు. కాలువ నిర్మాణ పనులు పూర్తయిన తరువాత క్రమేపే ఉద్యోగులు, సిబ్బందిని తగినంత మేరకు కుదించి మిగిలిన సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇక్కడ నివాస గృహాలు క్రమంగా ఖాళీ అయ్యాయి. దీంతో ప్రస్తుతం ఇక్కడ డీఈ కార్యాలయం మాత్రమే ఉంది. మిగిలిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల చుట్టూ పిచ్చమొక్కలు పెరిగి పాములు, కీటకాలకు నిలయంగా మారాయి. తరచూ శిథిల భవనాల నుంచి గోడలు, పైకప్పులు కూలుతున్నాయి. విద్యార్థులు మరుగు దొడ్లకు, స్నానాలకు వెళ్లాలన్నా ఈ భవనాల ద్వారా వెళ్లాలి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాలుర గురుకులం ఆవరణలోని శిథిల భవనాలను తొలగించాలని కోరుతున్నారు.

అ'పూర్వ' కలయిక


పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

శ్రీకాళహస్తి, జూలై 28: ముప్పై రెండేళ్లు, ఒక తరానికి సరిపడ కాలం గడచిపోయింది. కొత్త తరం వచ్చింది కానీ నాటితరం ఇంకా పాతబడలేదు. అర్థదశాబ్ధి చూసిన అనుభవాలు... యువకులుగా చేసిన కేరింతలు, అల్లరిగా ఆడిన ఆటలు, పాడిన పాటలు, పంచుకుంది. డిగ్రీ వదలిన కళాశాలలో మళ్లీ కలిసింది. ఒకనాటి అనుభూతుల మాలికలు తిరిగి అల్లుకుంది. ఆడుకుంది... పాడుకుంది. ఇది విద్యాప్రకాశనందగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1989-92 పూర్వ విద్యార్థుల సమ్మేళనం హడావుడి, ఒకప్పటి ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణమైన ఇప్పటి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భువన విజయం వేదికగా ఆదివారం ఈఅపూర్వ సమ్మేళనం జరిగింది. మొత్తం 50మంది పూర్వ విద్యార్థులు(బీజడ్సీ, ఎంపీసీ), 15మంది పూర్వ అధ్యాపకులు హాజరయ్యారు. విద్య నేర్పిన గురువులను సభక్తికంగా సత్కరించుకున్నారు. వారినుంచి ఆశీస్సులు తీసుకున్నారు. వారి అమృత వాక్కులు నాటి క్రమశిక్షణతో విన్నారు. గురువులు అటు వెళ్లగానే అంతటి క్రమశిక్షణ ఎలా పోయిందో, పూర్వ విద్యార్థులు, ఇప్పటి విద్యార్థుల్లా మారిపోయారు. మళ్లీ కుర్రతనంలోకి వెళ్లిపోయారు. ఆడిపాడి నాటి ఆనందాలను కుప్పపోసుకున్నారు. ఒకప్పటి అనుభూతులను తిరిగి ఆవాహన చేసుకున్నారు. కలుసుకున్నామన్న ఆనందంతో.. మళ్లీ కలుసుకుంటామో లేదో అన్న భారంతో ఒకరినుంచి ఒకరు వీడ్కోలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వవిద్యార్థుల కేరింతలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం మధురానుభూతులను నెమరువేస్తూ ఉండిపోయింది. అధ్యాపకులు శ్రీనివాసులునాయుడు, వెంకట్రామయ్య, సెల్వం, రాధయ్య, గుణశేఖర్, సర్వవతి, రామచంద్రయ్య, ఓపీ ప్రసాద్, వల్లెమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు జి.బాబు, కేపీ మునిసురేష్, ప్రసూన, రమేష్, బాలమురళి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

పిచ్చాటూరు, జూలై 28: పిచ్చాటూరు సమీపంలోని రామగిరి వాలీశ్వరస్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న కుమార సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి భరణి అభిషేకాలు, రాత్రి భరణి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం భక్తులు కావళ్ల మోస్తూ హరోం... హర అంటూ ఆలయ ఆవరణను మార్మోగించారు. ఉభయదారు ఏవీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి బాణసంచా పేలుళ్ల, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

దొంగల కోసం పోలీసుల గాలింపు


కుక్కలు అరుస్తుండడంతో మెట్ల వద్ద దాక్కున్న దొంగలు

రేణిగుంట, జూలై 28: గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా నగర్‌లో ఓ ఇంట్లో చోరీకి యత్నించిన ఇద్దరు దొంగల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి బిస్మిల్లా నగర్‌లోని ఓ ఇంట్లో ఇద్దరు దొంగలు చోరీకి యత్నించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. దొంగలు ముఖానికి మాస్కు, తలకు టోపీ, చేతికి గ్లౌస్ ధరించి ఎక్కడా వేలిముద్రలు పడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే కుక్కలు గుంపుగా చేరి పెద్దగా అరవడంతో స్థానికులు బయటకు వచ్చారు. దీంతో దొంగలు మెట్ల వద్ద దాక్కున్నారు. అనంతరం అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. ఈ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. దీని ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ఆదివారం నుంచి మండల వ్యాప్తంగా పోలీసులు గాలింపు చేపట్టారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

వరదయ్యపాళెం, జూలై 28: వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్, శ్రీసిటీ ఫౌండేషన్, పాండూరు కోదండరామస్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 369 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోదండరామస్వామి సేవాసంఘం నిర్వాహకులు పరంధామరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజరు సురేంద్రకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు వివేక చైతన్య, అర్చన ఉమమహేశ్వర్, రాజశేఖర్ 150 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పారిశుధ్య పనులు

కేవీబీపురం, జూలై 28: మండలంలోని గ్రామాల్లో ఇటీవల అతిసార ప్రబలడంతో ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు సూచించారు. వారి సలహా మేరకు రంగయ్యగుంట, కాళంగి ఆదరం, బక్కపోతులగుంట, కండ్లూరు తదితర గ్రామాల్లో ఎవరికి వారే తమ ఇళ్ల ముందు పారిశుధ్య పనులు చేపట్టారు.

అన్నదానం

రేణిగుంట, జూలై 28: రేణిగుంట పట్టణంలో డాలర్స్ గ్రూప్ అధినేత, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దివాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో దివాకర్‌రెడ్డి అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎంజీ రెడ్డి, సోమశేఖర్, రాజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 28: బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో వీధిలైట్లకు సర్పంచు వెంకటమ్మ, ఉప సర్పంచు మునిరాజా, కార్యదర్శి ఇందరమ్మ ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. పని చేయని వీధిలైట్లను తొలగించి కొత్తవి అమర్చారు.

దళవాయి అగ్రహారం చెరువులో
అక్రమంగా మట్టి తవ్వకాలు


మట్టి తవ్వకాలు జరిపిన దళవాయి అగ్రహారం చెరువు

సత్యవేడు, జూలై 28: సత్యవేడు పట్టణంలోని దళవాయి అగ్రహారం చెరువులో దొంగలు పడ్డారు. సత్యవేడు తమిళనాడు సరిహద్దుకు కూతవేటు దూరంలో ఉండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. తమిళనాడులో మట్టి తరలింపునకు అక్కడి ప్రభుత్వ నిబంధనలు కఠినతరంగా ఉండడంతో సత్యవేడు మండలంలో మట్టి మాఫియా ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతోంది. సంబంధిత అధికారులు ఉదాసీనంగా ఉండడంతో ఎక్స్‌కవేటర్లతో రాత్రికి రాత్రే మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల ధాటికి చెరువులు, కాలువలు కనుమరుగై పోతున్నాయి. శనివారం రాత్రి పట్టణంలోని దళవాయి అగ్రహారం చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలు జరిపారు. ఆదివారం ఉదయం వరకు సుమారు 50 ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. పట్టణ నడిబొడ్డున రాత్రివేళ అక్రమ మట్టి తరలింపు జాతరలా జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు గాని, రెవెన్యూ అధికారులు గాని గుర్తించకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి: బీజేపీ

సత్యవేడు, జూలై 28: సత్యవేడు దళవాయి అగ్రహారం చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడ్డ వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్ ఒక ప్రకటనలో కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మట్టి తవ్వకాలతో ప్రజలు విసిగిపోయి కూటమి ప్రభుత్వానికి అధికారం అందించారని, ఇలాంటి తరుణంలో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నది ఏ పార్టీ వారయినా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ఆదిమూలం సైతం దృష్టి సారించాలని ఆయన కోరారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్‌తో కోటేశ్వరబాబు

శ్రీకాళహస్తి, జూలై 28: ప్రముఖ సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వరబాబుకు తమిళనాడు రాష్ట్రం హోసూరులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. జర్నలిజం, సామాజిక రంగాల్లో తాను చేస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించినట్లు కోటేశ్వరబాబు చెప్పారు. డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కేసుపై
వివిధ కోణాల్లో దర్యాప్తు


తుకారాంలో ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలక రికార్డులు తగులబెట్టిన కేసుపై పోలీసులు దర్యాప్తు వివిధ కోణాల్లో చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి తుకారాం కాపురముంటున్న తిరుపతి నగరం మంగళం రోడ్డులోని ఇంట్లో ఆదివారం మదనపల్లె పోలీసులు, సీఐడీ అధికారులు మూడు గంటల పాటు తనిఖీలు చేసి, కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిరుపతిలో ఉన్న మాజీ మంత్రి బినామీలను విచారించనున్నట్లు సమాచారం.

ప్రధాని వ్యాఖ్యలు మంచి స్ఫూర్తి

శ్రీకాళహస్తి, జూలై 28: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యలు మంచి స్ఫూర్తిని కలిగిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం డీడీ చానల్‌లో ప్రసారమైన మన్ కీ బాత్ 112వ ఎపిసోడ్‌ను నాయకులతో కలిసి వీక్షించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 28: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 29వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,969 మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,048మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,640మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,015, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 346మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 221మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 68మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,957 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రమేష్ చంద్రప్రసాద్ సేవలు చిరస్మరణీయం


రమేష్ చంద్రప్రసాద్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 28: తెలుగుదేశం పార్టీ వెలుగుల్లో గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ పేరు, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం నింద్ర మండలం ఒరూరుపేటలోని ఆయన స్వగృహంలో రమేష్ చంద్రప్రసాద్ పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఒరూరుపేటకు వెళుతూ పిచ్చాటూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద టీడీపీ నాయకులతో కలసి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

సేవతోనే సంతృప్తి

శ్రీకాళహస్తి, జూలై 28: సేవతోనే సంతృప్తి కలుగుతుందని బీజేపీ నాయకుడు గరికపాటి రమేష్‌బాబు, ఏడుగంగమ్మల జాతర కమిటీ అధ్యక్షుడు స్వర్ణమూర్తి అన్నారు. పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషా, సభ్యులు బాబా ఫరీద్, హరినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.